క్లుప్తంగా

నేడు శివాలయ మండపం ప్రారంభం

గోకవరం: స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన మండపాన్ని ఆదివారం ప్రారంభించనున్నట్టు కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మండపంలో వివిధ దేవతల విగ్రహాలను ప్రతిష్ఠిస్తామన్నారు. విగ్రహ ప్రతిష్ఠలో భక్తులు పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని కోరారు.

కనకదుర్గ అమ్మవారి బ్రహ్మోత్సవాల ముగింపు



రౌతులపూడి కనకదుర్గ అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

రౌతులపూడి: స్థానిక సినిమా సెంటర్‌లో వెలసిన కనకదుర్గ అమ్మవారి ఆలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఆగమ పండితుడు పూజ్యం నాగేశ్వరరావుశర్మ ఆధ్వర్యంలో రుత్విక్కులు అమ్మవారికి కుంకుమ పూజలు, గ్రామోత్సవం, కుంభాభిషేకం, హోమం నిర్వహించారు. గ్రామంలో ప్రజలందరికీ సుఖ సంతోషాలు కలగాలని కోరుతూ ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయ సన్నిధిలో అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కర బాబు, మంగాలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, రమణమ్మ దంపతలు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు (అతిథి అధ్యాపకుడు) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డి.సునీత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత, అనుభవం కలిగి తెలుగు సబ్జెక్టు పీజీలో 50 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. నెట్, సెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 13న కళాశాలకు నేరుగా వచ్చి డెమో క్లాస్ నిర్వహించాలని ప్రిన్సిపాల్ సునీత సూచించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



రౌతులపూడిలో గర్భిణులకు పౌష్టికాహారం వడ్డిస్తున్న వైద్యాధికారి జానకీదేవి

రౌతులపూడి: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శనివారం గర్భిణులకు ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్‌లో భాగంగా వైద్య పరీక్షలు చేశారు. వైద్య పరీక్షల కోసం వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులకు సీహెచ్‌సీ వైద్యాధికారి జానకీదేవి ఆర్థిక సహకారంతో పౌష్టికాహారం అందించారు. మండలంలోని సుదూర ప్రాంతాల నుంచి వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు ప్రతినెల దాతల సహకారంతో పౌష్టికాహారం అందిస్తున్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ జానకీదేవి సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేతల అరెస్టు, విడుదల

కోటనందూరు: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యగా పలువురు టీడీపీ నేతలను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు యనమల కృష్ణుడిని తునిలో అరెస్టు చేసి స్థానిక పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. మండలంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజబాబు, ఎస్సీ సెల్ నాయకుడు బోడపాటి సత్తిబాబును అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు నేతలను విడుదల చేశారు.

జ్యోతుల నెహ్రూ హౌస్ అరెస్టు

జగ్గంపేట: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడి అరెస్టు నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. శనివారం తెల్లవారుజాము నుంచి జగ్గంపేట మండలం ఇర్రిపాకలో రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్‌లను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

రామలింగేశ్వరునికి పూజలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలోని ఉమా రామలింగేశ్వరునికి శనివారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వీరబాబు, దత్తులు స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పళ్లతో స్వామిని అలంకరించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రజలందరికీ రక్షిత తాగునీరు

- ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్
- కత్తిపూడిలో వాటర్ ట్యాంకుల ప్రారంభం



కత్తిపూడిలో వాటర్ ట్యాంక్‌లను ప్రారంభిస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

శంఖవరం: ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని కత్తిపూడిలో రూ.90 లక్షలు జలజీవన్ మిషన్ నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌లను శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తున్నట్టు తెలిపారు. అన్ని గ్రామాల్లోనూ మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. అర్హులందరికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరాల శ్రీను, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, సర్పంచ్ కొల్లు సత్తిబాబు, ఉప సర్పంచ్ గౌతు నాగు, కో ఆప్షన్ సభ్యుడు గాబు కృష్ణ, ఎంపీటీసీలు చల్లా సత్యప్రసాద్, జీలకర్ర వీష్ణు, సర్పంచులు తోట కృష్ణ, రామిశెట్టి ఏసుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గౌతు అర్జబాబు, అడపా సోమేష్, ఆకుల దేవేంద్రుడు, రామిశెట్టి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 414 కేసుల పరిష్కారం



ప్రత్తిపాడు లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి కాటం భాను

ప్రత్తిపాడు: స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 414 కేసులను పరిష్కరించినట్టు న్యాయమూర్తి కాటం భాను తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో 77 క్రిమినల్ కేసులు రాజీ అయ్యాయి. రెండు మనోవర్తి, 2 గృహ హింస, నాలుగు సివిల్ కేసులు పరిష్కారమయ్యాయి. రెండు బ్యాంక్ ప్రీ లిటిగేషన్ కేసుల ద్వారా బ్యాంకులకు రూ.1.60 లక్షలు, బీఎస్ఎన్ఎల్ సంస్థకు చెందిన 24 కేసులను పరిష్కరించడం ద్వారా ఆ సంస్థకు రూ.14,699 చెల్లింపులు చేయించారు. 303 సాధారణ కేసులను పరిష్కరించడం ద్వారా కక్షిదారులకు రూ.5,14,570 జరిమానా విధించారు. కార్యక్రమంలో బెంచ్ మెంబర్ బొంగుశూరి మధుబాబు, లోక్ అదాలత్ బాధ్యురాలు పి.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తునిలో 392 కేసుల పరిష్కారం

తుని: జాతీయ లోక్ అదాలత్‌లో 392 కేసులను పరిష్కరించినట్టు అధికారులు తెలిపారు. స్థానిక దివాణం వీధిలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో శనివారం న్యాయమూర్తి కె.బాలకోటేశ్వరరావు ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇరు పక్షాల కక్షిదారుల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించారు. సివిల్ 17, క్రిమినల్ కేసులు 375 పరిష్కరించారు. ఈ సందర్భంగా తుని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రగడ చక్రరావు ఆధ్వర్యంలో కక్షిదారులకు పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



పెరుమాళ్లపురంలో లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందజేస్తున్న వైస్ ఎంపీపీ నాగం గంగబాబు

తొండంగి: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీలో శనివారం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు కొత్తగా మంజూరైన పింఛన్లను తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, ఇతర నాయకులతో కలిసి ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తున్నారన్నారు. మండల వ్యాప్తంగా 260 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ పసపులేటి సతీష్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-2 యాదాల రమణ, పంచాయతీ ఉప సర్పంచ్ పెరుమాళ్ల లోవరాజు, పార్టీ నాయకులు బద్ది నూకరాజు, అప్పలరాజు, కొంజెర్ల వీరబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



ఏవీ నగరంలో మహిళలకు జగనన్న పాలవెల్లువ చెక్కులను అందజేస్తున్న కొయ్యా మురళి

తొండంగి: మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు కొయ్యా మురళి అన్నారు. మండలంలోని ఏవీ నగరంలో శనివారం మహిళా పాడి రైతులకు జగనన్న పాలవెల్లువ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఆర్థిక ఇబ్బందులు పడకుండా ఉండేందుకు పలు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. విద్యార్థులకు అమ్మఒడి, పేదలందరికీ ఇళ్లు, జగనన్న పాలవెల్లువ వంటి పథకాలన్నీ మహిళలే కేంద్ర బిందువుగా అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొయ్యా జగదీశ్వరి, గ్రామ సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో నా భూమి-నా దేశం



ఏలేశ్వరంలో మట్టి సేకరిస్తున్న బీజేపీ నాయకులు



వేములపాలెంలో మట్టిని సేకరిస్తున్న బీజేపీ నేతలు

ఏలేశ్వరం: పట్టణంలో శనివారం నా భూమి-నా దేశం కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ పట్టణ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ రెడ్డి లోవరాజు ఆధ్వర్యంలో 5, 6 వార్డుల్లో మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ఈ నెల 1 నుంచి 15వ తేదీ నుంచి మేరీ మాటీ మేరాదేశ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా అమర వీరులను స్మరించుకుంటూ ప్రతి గ్రామం నుంచి మట్టిని సేకరిస్తున్నామని తెలిపారు. సేకరించిన మట్టిని ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో అమృత వనం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గట్టిం వెంకటరమణ, దాకే కృష్ణారావు, వెలుగూరి హరేరామ్, రెడ్డి వరలక్ష్మి, గట్టిం సీతారామ్, గునిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నా భూమి-నా దేశం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెం, వేములపాలెం గ్రామాల్లో శనివారం నా భూమి నా దేశం కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు గున్నాబత్తుల రాజబాబు మాట్లాడుతూ దేశ కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులను స్మరిస్తూ ఢిల్లీలో స్మృతి వనం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో మట్టిని సేకరిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రోగ్రాం ఇన్‌చార్జ్ కంద వీరస్వామి, పార్టీ నాయకులు కర్రి ధర్మరాజు, చింతాకుల రామకృష్ణ, ఈర్ల దేవి తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం నా భూమి-నా దేశం కార్యక్రమం నిర్వహించారు. పాలెం, సోమరాయణంపేట గ్రామాల్లో బీజేపీ మండలాధ్యక్షుడు యడాలి రాంబాబు ఆధ్వర్యంలో మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గ్రామాల్లో నా భూమి- నా దేశం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు బొడ్డేటి బాబూరావు, మండల ఉపాధ్యక్షుడు వీరవెంకట సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు రామ కోటేశ్వరరావు, అడారి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సైకిల్ యాత్ర

ప్రత్తిపాడు: విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్ఎఫ్ఐ చేపట్టిన సైకిల్ యాత్ర శనివారం ప్రత్తిపాడు మీదుగా కొనసాగింది. ఎస్ఎఫ్ఐ మండల కన్వీనర్ చవాకుల నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన తుని నుంచి మొదలైన విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర మండలంలోని ధర్మవరం, ప్రత్తిపాడు మీదుగా ఏలేశ్వరం మండలం చిన్నింపేట మీదుగా సాగింది. ఈ యాత్రలో సుమారు 20 మంది ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్ట్ సమంజసమే

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం



శంఖవరంలో విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్



జగ్గంపేటలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి రఘురాం

శంఖవరం: ప్రజల సొమ్మును కాజేసిన చంద్రబాబు నాయుడిని అరెస్ట్ చేయడం సమంజసమేనని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. శనివారం ఆయన స్వగ్రామం శంఖవరంలో విలేకర్లతో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో రూ.371 కోట్లు ప్రజల సొమ్మును దుర్వినియోగం చేయడం దారుణమన్నారు.ఇంటిలిజెన్స్, ఐటీ, ఈడీ, సెబీ లాంటి సంస్థలు విచారణ చేసిన స్కాంను బయట పెట్టాయన్నారు. గత ప్రభుత్వంలో కేబినెట్ నిర్ణయం లేకుండా ఈ స్కాం చేశారని తెలిపారు. చంద్రబాబునాయుడు 2014లో అధికారం చేపట్టిన రెండు నెలలకే ఈ స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం ఊపిరి పోసుకుందన్నారు. దోచిన సొమ్మును విదేశాలకు తరలించి అక్కడ నుంచి తన అనుచరుల ద్వారా స్వదేశానికి తీసుకువచ్చారన్నారు. కేసును పక్కదోవ పట్టించేందుకే టీడీపీ నాయకులు గందరగోళం చేస్తున్నారన్నారు. చంద్రబాబు తప్పుచేశాడు కాబట్టే రెండు రోజుల నుంచి తనను అరెస్ట్ చేస్తారని ప్రచారం చేసుకున్నారన్నారు. ఈ స్కాంలో అధిక లాభం చంద్రబాబుకే చేకూరిందని తేలడంతో సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారన్నారు. చంద్రబాబు ప్రజల సొమ్మును కాజేసి నీతి కబుర్లు చెప్పడం దారుణమన్నారు. సమావేశంలో ఎంపీపీ పర్వత రాజబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగ్గంపేట: స్కిల్ డెవలప్‌మెంట్ పేరిట ఆర్థిక నేరాలకు పాల్పడిన టీడీపీ అధినేత చంద్రబాబును పక్కా ఆధారాలతో సీఐడీ పోలీసులు అరెస్టు చేయడం తప్పు ఎలా అవుతుందని రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. జగ్గంపేటలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ నేతలు చంద్రబాబు అవినీతిని కప్పిపుచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. చంద్రబాబు అరెస్టును రాష్ట్రానికి బ్లాక్ డేగా అభివర్ణించడం సరికాదన్నారు. నిజాయితీ పరుడిగా చెప్పుకునే చంద్రబాబు అవినీతి బండారం బయట పడిందని, దీనిని తెలుగుదేశం పార్టీకి బ్లాక్ డేగా చెప్పుకోవాలని అన్నారు. నిజాయితీ ఉంటే చంద్రబాబు సీఐడీ పోలీసులకు సహకరించడంతో పాటు చట్టాన్ని గౌరవించాలన్నారు. చంద్రబాబు తాను అరెస్టు అవుతానని తెలిసి ముందు నుంచి తనను అరెస్టు చేస్తారని చెప్పుకుంటూ సానుభూతి పొందడానికి ప్రయత్నించారని విమర్శించారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో తనిఖీలు



గోకవరం ప్రభుత్వాస్పత్రిని పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ సనత్‌కుమారి

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రిని శనివారం డీసీహెచ్ఎస్ డాక్టర్ సనత్‌కుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల కోసం ఆస్పత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికీ పూర్తి స్థాయిలో వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. గర్భిణులకు అందుతున్న వైద్య సేవలు, ఆస్పత్రిలో సదుపాయాలను పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

సంప్రదాయ లాంఛనాలతో తాడిపెద్దు ఖననం



ట్రాక్టర్‌పై పల్లకీలో తాడిపెద్దు కళేబరాన్ని ఊరేగిస్తున్న కేఓ మల్లవరం గ్రామస్తులు



తాడిపెద్దు కళేబరం

తుని రూరల్: మండలంలోని కేఓ మల్లవరంలో మృతి చెందిన తాడిపెద్దును గ్రామస్తులు సంప్రదాయ లాంఛనాలతో శనివారం ఖననం చేశారు. 22 సంవత్సరాల వయస్సు గల తాడిపెద్దు వృద్ధాప్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. సర్పంచ్ డొంక సత్యవతి, గ్రామస్తులు, శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఖననం చేశారు. ట్రాక్టర్‌ను పూలతో విశేషంగా అలంకరించి దానిపై తాడిపెద్దు కళేబరాన్ని ఉంచి మేళ తాళాలు, మహిళల కోలాటంతో శ్రీకృష్ణుడి గుడి వరకూ ఊరేగింపు నిర్వహించారు. అక్కడ తాడిపెద్దును ఖననం చేశారు. భోగి రోజు జన్మించిన దూడను తాడిపెద్దుగా అచ్చు వేసి పర్వదినాల్లో బాజాభజంత్రీలతో ఊరేగింపులు నిర్వహిస్తామని, సింహాద్రి అప్పన్నగా ఇన్నాళ్లు గ్రామానికి సేవలు అందించిందని పలువురు పేర్కొన్నారు.

దశాబ్దాల కల సాకారం

- అన్నవరంలో కైలాసభూమి నిర్మాణానికి భూమిపూజ
- పాల్గొన్న ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- రూ.10 లక్షల విరాళం ప్రకటించిన వ్రతపురోహిత సంఘం



ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత, ఎంపీపీ రాజబాబును సత్కరిస్తున్న సర్పంచ్ కుమార్ రాజా, తదితరులు

అన్నవరం: గ్రామ ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. గ్రామస్తులు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న కైలాసభూమి (హిందూ శ్మశానవాటిక) నిర్మాణానికి తొలి అడుగు పడింది. అన్నవరంలో రూ.కోటి వ్యయంతో నిర్మించే శ్మశానవాటికకు శనివారం కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు అన్నవరంలో శాశ్వత ప్రాతిపదికన హిందూ శ్మశానవాటిక లేకపోవడం దురదృష్టకరమన్నారు. గత మూడేళ్లుగా శ్మశానవాటికకు స్థలం కోసం ప్రయత్నాలు చేయగా సర్వే నెంబర్ 76లో దాత జంపన కేశవరాజుకు చెందిన 1.20 ఎకరాల స్థలాన్ని శ్మశానవాటికకు ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. ఆ స్థలంలో ఎంపీ గ్రాంట్, ఎమ్మెల్యే గ్రాంట్, మండల పరిషత్, పంచాయతీ నిధులతో పాటు గ్రామస్తుల విరాళాలతో శ్మశానవాటిక నిర్మిస్తునట్టు తెలిపారు. డిసెంబర్ కల్లా శ్మశానవాటిక నిర్మాణం పూర్తి చేయాలని సర్పంచ్‌కు ఆయన సూచించారు. ఎంపీ వంగా గీత మాట్లాడుతూ శ్మశానవాటికకు కేటాయించిన స్థలంలో మామిడిచెట్లను తొలగించకుండా వాటి చుట్టూ చప్టా నిర్మించి శవదహనాలకు వచ్చేవారు కూర్చునేలా ఏర్పాటు చేయాలని సూచించారు. శ్మశాన వాటిక నిర్మాణానికి గ్రామంలోని అన్ని సామాజికవర్గాల ప్రజలు విరాళాలు ప్రకటించారని, వాటిని త్వరగా అందజేయాలని సర్పంచ్ కుమార్‌రాజా కోరారు.

వ్రతపురోహిత సంఘం విరాళం

శ్మశానవాటిక నిర్మాణానికి తాము గతంలో ప్రకటించిన రూ.10 లక్షల విరాళం త్వరలో అందజేస్తామని అన్నవరం దేవస్థానం వ్రతపురోహిత సంఘం గౌరవ అధ్యక్షుడు నాగాభట్ల కామేశ్వరశర్మ, నాయకుడు రవిశర్మ తెలిపారు. సత్యదేవ బ్రాహ్మణ నిత్యాన్నదానసత్రం అధ్యక్షుడి హోదాలో రూ.1,01,116 విరాళాన్ని అందజేస్తానని కామేశ్వరశర్మ తెలిపారు. కార్యక్రమంలో శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, వైస్ ఎంపీపీ ధారా వేంకట రమణ, రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమణమూర్తి, పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు కందర్ప సత్యనారాయణ మూర్తి, అన్నవరం ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, దర్శిపూడి భద్రరావు, దాసరి నగేష్, దాసరి శంకర్, వ్రతపురోహితులు రవిశర్మ, వైఎస్సార్ సీపీ నాయకులు వీర్ల సూరిబాబు, కొండపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు శంకుస్థాపన

పంపా బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన నాన్ పర్వత పూర్ణచంద్రప్రసాద్ మార్కెట్ నిర్మాణానికి ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ మార్కెట్ సముదాయంలో వంద షాపులు నిర్మిస్తామని సర్పంచ్ తెలిపారు. అనంతరం క్రైస్తవ శ్మశానవాటికను ప్రారంభించారు. కొత్తపేటలో పెన్షనర్స్ భవనం కూడా ప్రారంభించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జగ్గంపేట: కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఏఎస్ఐ నూకరాజు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... జగ్గంపేట మండలం జె.కొత్తూరు గ్రామానికి చెందిన బాదిరెడ్డి సత్యనారాయణ (52) మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు మందలించినా మద్యాన్ని వదల లేక పోతున్నాని మనస్తాపానికి గురై గత నెల 8న గడ్డి మందు తాగాడు. అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు ప్రశ్నించడంతో గడ్డిమందు తాగిన విషయాన్ని చెప్పాడు. దీంతో గత నెల 12న కుటుంబ సభ్యులు అతడిని జగ్గంపేట సీహెచ్‌సీకి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు బాదిరెడ్డి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నూకరాజు తెలిపారు.

మహిళ మృతి

గండేపల్లి: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందినట్టు స్థానిక ఎస్సై వై.గణేష్‌కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని పి.నాయకంపల్లి గ్రామానికి చెందిన చమ్మంగి లక్ష్మి (43) గత కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా, అనారోగ్యంతో బాధపడుతోంది. గత నెల 28న పురుగుల మందు తాగింది. ఆమెను చికిత్స నిమిత్తం బంధువులు కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నిరుపయోగంగా వ్యాయామ పరికరాలు



మట్టిలో కూరుకుపోయిన వ్యాయామ పరికరాలు



వ్యాయామ పరికరాల వద్ద పెరిగిపోయిన పిచ్చి మొక్కలు

ఏలేశ్వరం: శరీర దారుఢ్యంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు నిరుపయోగంగా మారాయి. గతంలో ఏలేశ్వరం నగర పంచాయతీకి ప్రభుత్వం వ్యాయామ పరికరాలు మంజూరు చేసింది. వీటిని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేశారు. స్థానికులు ప్రతిరోజూ వీటిపై వ్యాయామం చేసేవారు. కొన్ని నెలల క్రితం వీటి సమీపంలో ప్రభుత్వ భవన నిర్మాణం చేపట్టంతో వీటిలో కొన్నింటిని తొలగించారు. మరికొన్ని అక్కడ వేసిన మట్టిలో కూరుకుపోయాయి. దీంతో ఇవి నిరుపయోగంగా మారడంతో పాటు ఆ ప్రాంతంలో మొక్కలు పెరిగిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే వ్యాయామ పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

హైవేపై బ్లేడ్ బ్యాచ్ హల్‌చల్

జగ్గంపేట: పదహారో నంబర్ జాతీయ రహదారిపై రామవరం వద్ద మోటార్ సైకిల్‌పై జగ్గంపేట వైపు వస్తున్న ముగ్గురు యువకులపై ఈ నెల 4వ తేదీ రాత్రి బ్లేడ్ బ్యాచ్ దాడి చేసినట్టు జగ్గంపేట ఏఎస్ఐ నూకరాజు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. జగ్గంపేట గ్రామానికి చెందిన కుర్ర బాలస్వామి, అతని స్నేహితులు ఈ నెల 3న స్వీట్లు డెలవరీకి ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామానికి మోటారు సైకిల్‌పై వెళ్లారు. ఆ రోజు రాత్రి 12 గంటల తరువాత జగ్గంపేట గ్రామానికి తిరిగి వస్తుండగా రామవరం వద్ద వీరి మోటారు సైకిల్‌ను ముగ్గురు వ్యక్తులు అడ్డగించి బ్లేడులతో బెదిరించారు. కుర్ర బాలస్వామి, అతని మిత్రులపై పిడిగుద్దులు కురిపించి వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు 3, రూ. 2 వేలు నగదు దోపిడి చేశారు. దీనిపై బాలస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.